8 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 28 ఏప్రిల్ 2025
www.ntnews.com

# చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



## దీర్ఘ నిట్టూర్పు

ఆత్మలు అమ్ముకున్నాక
ఆస్తుల మత్తు కమ్ముకుంటది
తలపులు గంపగుత్తకు చెల్లిపోయాక
విలువలు సింహాసనం
కింద పాతరౌతయి
భావనలు ఊడిగానికి మరిగాక
సృష్టులు కోతిబొమ్మలై
వనాన్ని చెరుస్తయి
ఆశలకు తోకలు మొలిచాక
ఆశయాలు నేల విడిచి వెళ్లిపోతయి
బుల్లెట్ ప్రూఫ్ అందలం ఊరేగిస్తది

దంచే పంచ్ డైలాగ్‌లకు
చప్పట్లు మోగాక
మందార మకరంద మాధుర్యమున
భాషించు నెవడు
సిద్ధమైన, వెల్ల వేసిన
స్క్రిప్ట్ వల్లింపులున్నాక
హరిశ్చంద్రుని సత్య నియమమే ఏల
పక్షి స్వేచ్ఛా రెక్కలు విరిచి
చెట్టు తల్లి, పిల్ల వేళ్ళు నరికి
నదికి నవ్వుల నురుగుల అద్దకం
సముద్ర మీదిన
కాగితప్పడవల నిండారా
త్రిజోరీల రాక

స్వేదం
పెరుగన్నంలో కలిసిపోతున్నదే
నిట్టాడు కూల్చి
దోషిగ నిలబెడ్తున్నరే
ఒప్పుల కుప్ప నుంచి
అప్పుల కుప్పల మునిగినమే
వెంటాడే, వేటాడే లక్ష్యాల
రెండు కళ్ళ సిద్ధాంతపు బాటనే

హరిణ మరణపు వేళ,
మానిషాద శోకం
ఏ మనిషికైనా చేరేనా
మూగ నిగళాల గొంతు
పెకలించేనా

చెంగల్వ

నేటి తెలుగు కవిత్వాన్ని ఐదారు దశాబ్దాల కిందటి కవిత్వంతో పోల్చి చూస్తే, అందులో చెప్పుకోదగిన పరిణతి ఏర్పడిందన్నది వాస్తవమే. అయితే, దానికి కారణం చాలావరకు కాలానుగతమైనదే అని చెప్పాలి. సంప్రదాయ రచనారీతి నుంచి పక్కకు తొలగి, అభివ్యక్తి విధానంలో కొత్తదనం, ఔన్నత్యం సాధించడమన్నది ఇతర భారతీయ భాషల్లో ఎలా జరిగిందో తెలుగులో కూడా అలానే జరిగింది. అయినా ఇది సంతోషించదగిన విషయమే. కానీ, తెలుగు కవిత్వంలో వస్తువైవిధ్యం, శిల్పవైవిధ్యం పెరగాలి. ఈ రెండు వైవిధ్యాలు ఇప్పుడు లేవా? అని ప్రశ్నిస్తే ఎందుకు లేవు, ఉన్నాయి. కానీ, అవి ఒక పరిమితికి లోబడి వృత్తపరిధిని దాటలేకపోతున్నాయి, అన్నది సమాధానం.

# పరిధి దాటని తెలుగు కవిత



ఇతర భాషల్లోని కవిత్వంలో చోటుచేసుకుంటున్న వస్తుశిల్పాల్లోని వైవిధ్యాన్ని పరిశీలిస్తే తప్ప ఈ సత్యాన్ని గ్రహించలేం. ఆంగ్లకవిత్వాన్ని, బెంగాలీ, అస్సామీ, ఒడియా, పంజాబీ, కన్నడం, తమిళం, మలయాళం లాంటి భారతీయ భాషల కవిత్వ ఆంగ్లానువాదాలనూ ఉన్నత స్థాయి పత్రికల్లో చదవడం ద్వారా ఈ ఉటంకింపు (statement) లోని సత్యాన్ని రూఢి చేసుకోవచ్చు. ఆ పత్రికల్లో తెలుగు కవితల ఆంగ్లానువాదాలు అత్యంత అరుదుగా అచ్చవుతాయి. కాబట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయి కవిత్వాన్ని చదవడమే కాకుండా దాన్ని జాగ్రత్తగా పరిశీలించాలన్న మాట. లేకపోతే ఆ భాషల కవిత్వంలోని కొత్త ధోరణులు (new trends) మనకు పరిచయం కావు. వాటిని చదివితే తప్ప, కవిత్వాన్ని ఇట్లా కూడా రాయొచ్చా అని విస్తుపోయే అవకాశం ఎక్కడినుంచి వస్తుంది!? ఏదైతే మన మస్తిష్కానికి తెలియదో, దాన్ని మన కళ్లు దర్శించలేవు (What your mind does not know, your eyes cannot see) అన్నాడొక మహానుభావుడు. కొత్త రీతులతో పరిచయం (exposure) మనం కూడా కొత్తపుంతలు తొక్కేలా చేసి, ప్రయోజనాన్ని చేకూర్చుతుంది.

> ‘పద్ధతులను/ధోరణులను’ అనుసరిస్తూ రాసినంత మాత్రాన ఎవరి రచనలైనా కాపీ రచనలు అయిపోవు. తెలుగు కవిత్వపు స్థాయి ఇతర భాషల్లో కన్న తక్కువగా ఉన్నదని అనడం లేదు. వస్తువైవిధ్యం, శిల్ప వైవిధ్యం పెరగాలనేదే ఇక్కడ చెప్పదల్చుకున్న ముఖ్య ఉద్దేశం.

ఎప్పుడైతే సామాజికత, సామాజిక ప్రయోజనం, సామాజిక స్పృహ కవిత్వంలో తప్పనిసరిగా ఉండవలసిన అంశాలు అనే అభిప్రాయాన్ని స్థిరపరచుకుంటామో, అప్పుడే మన కవిత్వంలో వస్తువులు సగానికి పైగా అదృశ్యమవుతాయి. అదేవిధంగా ప్రేమ, బాల్యం, అమ్మ, నాన్న, పుట్టిన ఊరు వీటి గురించే పదేపదే రాయడం వల్ల అవి అరిగిపోయిన వస్తువులుగా మారిపోతాయి.. మారిపోయాయి కూడా. సామాజికతను కలిగిన వస్తువులతో కవిత్వం రాయడం మంచిదే కానీ, తక్కినవి తప్పకుండా నిరసించదగినవి అని అనలేం కదా! కాబట్టి, అన్నిరకాల అంశాలనూ స్వీకరించగల దృక్పథాన్ని అలవర్చుకుంటే, కవిత్వంలో వస్తువైవిధ్యం పెరుగుతుంది. ఒకే వస్తువును తీసుకుని కవితలు రాయడమనేది సాధారణంగా జరగదు కానీ, ‘ఒకే రకానికి చెందిన’ వస్తువులను తీసుకుని రాయడం ఇప్పుడు తరచుగా జరుగుతున్నది. పర్సనల్ కవిత్వం, కంప్లయింట్ కవిత్వం, టెంప్లేట్ కవిత్వం పుంఖానుపుంఖాలుగా వెలువడుతున్నాయి. రాయడానికి ఈ ప్రపంచంలో కొన్ని వందల వస్తువులున్నా అవే అవే అంశాలను మళ్లీ మళ్లీ ఎంచుకోవడం సాధారణమైపోయింది. పాత అంశాలనే వస్తువులుగా స్వీకరించినా శైలిలో గాని, శిల్పంలో గాని ఏదైనా కొత్తదనాన్ని ప్రవేశపెడితే, అది కొంతవరకు నయం. అలా కానిపక్షంలో కొంతకాలం తర్వాత మన కవిత్వంలో మొనాటనీ (ఏకరూపత తాలూకు విసుగు) ఏర్పడుతుంది.

శిల్పంలో విశిష్టతను సాధించడం కష్టమైన పని. కానీ, శ్రేష్ఠమైన శిల్పం వల్లనే కవిత్వానికి గరిమ సిద్ధిస్తుంది. ఒక వ్యక్తిని కవిగా చేసేది శిల్పమే. శిల్పశ్రేష్ఠత ప్రతిభకు నిదర్శనం అన్నది వివాదరహితమైన విషయం. మంచి వస్తువును స్వీకరించేందుకు ప్రతిభ అవసరం లేదని కూడా చెప్పవచ్చు. మంచి వస్తువును ఎంచుకుని దాన్ని సమర్థవంతంగా నిర్వహించడంలో ప్రతిభ ఉంటుంది కానీ, కేవలం వస్తువును ఎంపిక చేసుకోవడంలోనే ఉండదు. కవిత్వం కోసం మంచి వస్తువులను స్వీకరిస్తే అది కవిని ‘మంచి వ్యక్తి’గా, లేదా అభ్యుదయ వ్యక్తిగా నిలబెట్టే అవకాశముంది. శిల్పం చాలా ముఖ్యమైనదని చెప్పినంత మాత్రాన వస్తువును చిన్నచూపు చూసే అవసరం లేదు. వస్తువు, శిల్పం రెండూ బాగుండాలి. కానీ, మనం అనుకునేవే మంచి వస్తువులు కానవసరం లేదని గ్రహించాలి. కళ, శిల్పం అనే మాటలు ఇవాళ తిట్టుపదాలైపోయి, వస్తువు, సామాజికతలు అధిక అభిమానాన్ని చూరగొంటున్నాయి. ఒకవేళ సామాజికత అవసరం అని చెప్పినా, అది ఒకే రకమైనదిగా ఎందుకుండాలి? బడుగు జీవుల మీద సహానుభూతితో రాయడం, సంపన్నులనూ దోపిడీదారులనూ విమర్శిస్తూ, నిరసిస్తూ రాయడం, లోకంలోని అన్యాయాలను అపసవ్యతలను చీల్చి చెండాడటం వీటిని మాత్రమే సామాజికతతో కూడిన రచనా విధానాలుగా పరిగణించాలా? సమాజంతో సంబంధం కలిగి ఉన్న మరెన్నో ఇతర విషయాలను కవితా వస్తువులుగా ఎన్నుకుంటే, సామాజికతను చొప్పించడంతో పాటు వైవిధ్యాన్ని చూపినవాళ్లమవుతాం. ఉదాహరణకు, ఏనుగు నరసింహారెడ్డి రాసిన ‘గాయపడ్డాకే’ అనే కవితను పరిశీలిద్దాం. అందులోని కొన్ని పంక్తులను ఇక్కడ ఇస్తున్నాను. చదవండి:

> దారిలో నడుస్తుంటే
> ‘చక్కగా నడవరాదా’ అంటారొకరు
> వాహనం మీద పోతుంటే
> డ్రైవింగ్ ఎక్కడ నేర్చుకున్నావంటారొకరు
> ఏదైనా వస్తువు ధర అడుగుతుంటే
> నీకు బేరం చేయడం వచ్చా అని
> దెప్పిపొడుస్తుంది ఆవిడ
>
> అన్ని చురకత్తుల్ని
> తప్పించుకోవాలనుకుంటాను
> చివరికి
> గాయపడ్డాకే ఇల్లు చేరుకుంటాను
> ఈ కవితలో సామాజికత లేదని చెప్పగలమా?

ఇటువంటి కవితలు మరెన్నో కూడా మన సాహిత్యంలో ఉంటాయి. దీన్ని కేవలం ఒక శాంపిల్‌గా చూపిస్తున్నాను. కవిత్వంలో సామాజికత లేనంత మాత్రాన కవిత్వ ఊహలోని విశిష్టతను, వినూత్నత్వాన్ని ఇష్టపడకూడదా? ఏ కొత్తదనమూ లేని, అరిగిపోయిన వస్తువులతో రాసిన కవిత్వాన్ని అభిమానిస్తాం కానీ, కల్పనలో వైవిధ్యాన్ని చూపించే కవితలను సామాజికత లేదనే నెపంతో తిరస్కరిస్తాం చిత్రంగా! కేవలం నవ్యత కారణంగానైనా అటువంటి కవిత్వాన్ని అభినందించవచ్చు. శంభు ఆర్ రాసిన ఆంగ్ల కవితకు తెలుగు అనువాదంలోని ఒక భాగాన్ని ఇస్తున్నాను. చదివి, వస్తువులోని variety ని ఆనందించండి.

> ఫుట్ పాత్ మీదనుండి
> రోడ్డుమీదికి అడుగు వేస్తూ,
> పెద్ద వానచినుకులను
> సామూహిక ఆత్మహత్యల నుండి
> రక్షించేందుకు నా గొడుగును విప్పుతాను
> అభిజాత్యం అతిగా వున్న చినుకులు
> పైన మెరిసే లోహపు శలాక మొనమీద దూకి
> తమను తాము అంతమొందించుకుంటాయి
> మిగతావి టప్పుమని మెత్తని శబ్దం చేస్తూ
> నల్లని గుడ్డమీద పడుతై

సామాజికత అనే విషయాన్ని పక్కనపెట్టి చూస్తే, as (లాగా)ను వస్తువు చేసుకుని ఆంగ్ల కవితను రాశాడొకాయన! అదేవిధంగా మరి (Then?) అనేది ఒక ఆంగ్లకథకు శీర్షిక. నిజానికి ఈ రెండు ఆత్మాశ్రయ రచనలు కావు. సమాజపు పోకడలతో పరోక్షమైన సంబంధం కలిగి ఉన్నవే. Then అనే ప్రశ్నను ఇతివృత్తం చేసుకొని కథను అల్లడం ఎంత అపురూపమైన విషయం! ఈ కవిత, కథలు జాతీయ స్థాయిని కలిగిన ప్రసిద్ధ పత్రికల్లో వచ్చాయి. ఇట్లా అరుదైన చిన్న అంశాలను వస్తువులుగా, ఇతివృత్తాలుగా చేసుకుని వాటి చుట్టూ మంచి శిల్పాన్ని అల్లుతూ రచనలు చేయడం వస్తువైవిధ్యానికి, శిల్పవైవిధ్యానికి తోడ్పడుతుంది. అయితే, అలా రాయడం వల్ల సమాజానికి ఏం ప్రయోజనం చేకూరుతుంది, అనే ఒక ప్రశ్న తలెత్తుతుంది ఇక్కడ. సమాజానికి పెద్దమొత్తంలో చేకూరకపోయినా సాహిత్యానికి చేకూరుతుంది కదా అంటే, అది వృథా అనేవాళ్లుంటారు మనలో చాలా మంది. అంటే ఒకే పద్ధతిలో డైరెక్ట్‌గా రాసినవే మంచివి అని అర్థం. ఇట్లాంటి వైఖరి వలన తెలుగు కవిత్వంలో వస్తుశిల్పాల వైవిధ్యం కొరవడుతున్నది. ■

> ఒకే వస్తువును తీసుకుని కవితలు రాయడమనేది సాధారణంగా జరగదు కానీ, ‘ఒకే రకానికి చెందిన’ వస్తువులను తీసుకుని రాయడం ఇప్పుడు తరచుగా జరుగుతున్నది. పర్సనల్ కవిత్వం, కంప్లయింట్ కవిత్వం, టెంప్లేట్ కవిత్వం పుంఖానుపుంఖాలుగా వెలువడుతున్నాయి. రాయడానికి ఈ ప్రపంచంలో కొన్ని వందల వస్తువులున్నా అవే అవే అంశాలను మళ్లీ మళ్లీ ఎంచుకోవడం సాధారణమైపోయింది.



ఎలనాగ



> అవును, కథ చెప్పడం ఒక కళ. తాను కథ చెప్పి, పిల్లల చేత కథాకథనంగా చెప్పించడం మరొక గొప్ప కళ. తాను ఉపాధ్యాయుడిగా ఉన్నప్పుడు విద్యార్థులకు ఒకవైపు పాఠాలు బోధిస్తూనే విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతకు పదునుపెట్టి వారిచేత ఉపాధ్యాయులు ఎన్నో రచనలను చేస్తున్నారనేది నిస్సందేహం. ఆ కోవలోకి చెందిన బాల కథకులు, బాల సాహిత్యానికి పెద్దన్న, దిక్సూచి గరిపల్లి అశోక్. తాను ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ చెందినా, పిల్లలతో తనకున్న అనుబంధాన్ని మరిచిపోలేదు. అందుకే, పిల్లలు చేసిన అల్లరి, ఆటపాటలను మదిలో భద్రపరిచారు. వాటిని నెమరు వేసుకుంటూ బడిలో జరిగిన సన్నివేశాలను చక్కటి కథల రూపంలో మనకు అందిస్తున్నారు. ఇది ఆయనకు కొట్టిన పిండి.

## కథ చెప్పడం ఒక కళ

అశోక్ రాసిన కథలన్నీ చదువుతుంటే నాటి జ్ఞాపకాలు ఒకసారి మదిని ముసురుకుంటాయి. మనకు మనమే మళ్లీ బాల్యంలోకి వెళ్లిపోతాం. అలాంటి చక్కటి కథకుడు గరిపెల్లి అశోక్. ఆయన కలం నుంచి జాలువారిన 11 కథల సంపుటి ‘గోటీలాట’. ‘బఠాణీలు’ కథలో ఒంటరిగా ఉన్నప్పుడు ఒకరే తినాలి, స్నేహితులతో ఉన్నప్పుడు, అందరు కలిసి తినాలి ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకునే ధోరణిని వివరించారు. ఇది విద్యార్థులకు చక్కటి సందేశం. మరో కథ ‘పిప్పరమెంటు’ ఈ కథలో ఒకటే చాక్లెట్‌ను ఇద్దరూ తీసుకోవాలని టీచర్ చెప్తుంది. అప్పుడు కాకి ఎంగిలి చేసి ఒకే చాక్లెట్‌ను పరసర్ప సహకారంతో విద్యార్థులు ఇద్దరు పంచుకుంటారు. విద్యార్థుల్లో పరస్పర సహకార భావం పెంపొందించేలా కథను చెప్పటం అభినందనీయం.

పుస్తకాల్లో ఉన్నది మాత్రమే చదువు కాదని, అంతకుమించి బతుకు పాఠాలు మరెన్నో ఉంటాయని ‘ఎండ్రికాయలు-చేప’ కథలో పాఠకులు తెలుసుకుంటారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మధ్య చక్కటి అనుబంధాన్ని తెలిపే మరో కథ ‘మక్క కంకులు’. పిల్లలు ఆడే గోటీలతో లెక్కల మాస్టారు సురేష్ గణిత బోధనకు ఉపయోగించడం అతని సృజనాత్మకతకు నిదర్శనం. ఇలా చెప్పుకుంటూ పోతే ‘గోటీలాట’ పుస్తకంలోని ప్రతీ కథ ఒక ఆణిముత్యమే. అందుకే ‘గోటీలాట’ ఈ కథల సంపుటి అందరూ తప్పక చదవాల్సిందే. ఇందులో ఉన్న ప్రతీ ఒక కథ ఒక మంచి సందేశాన్ని అందించింది. ఇలాంటి కథలు మరెన్నో అశోక్ సార్ కలం నుంచి జాలువారాలని కోరుకుంటూ రచయితకు శుభాకాంక్షలు.




యాడవరం రేవంత్ గౌడ్
94417 62105

## మంచుకొండల్లో యజ్ఞకుండాలు

ఎవరు పోసిన క్రోధాజ్యమో
ఎవరు రాజేసిన మహాయజ్ఞమో
ఇది పనిగట్టుకొని, పగబెట్టుకొని
సర్పాలను చంపాలనుకునే
జనమేజయ యజ్ఞం కాదు
ప్రాణాలను ప్రమిదలుగా
సామాన్యులను సమిధలుగా మార్చే
నిర్జన కోరికల దుర్జనుల యజ్ఞమిది

మంచుకొండలు యజ్ఞకుండాలైతే
మత మంత్రోచ్ఛారణతో
కొబ్బరికాయలా పగిలిపోవాలనో
తుపాకీ తూటాలకు పువ్వులా రాలిపోయి
నైవేద్యంగా మారిపోవాలనో
భార్యలెవరైనా తమ భర్తలను కోరుకుంటారా?
ఓట్లదండలేసుకునే రాజకీయ దేవతలకు




మొగుళ్లను మొక్కుబడిగా అర్పించుకుంటారా?
కాళ్లపారాణింకా చెదరకముందే
ఉగ్రవాదం
రక్తపారాణిని అదుముతుంటే
నదులను ఆపినంత తేలికగా
కన్నీటి కాలువలను ఆపగలమా?

ఇప్పుడు భార్యల హృదయాలు
లోతు చెప్పలేని అగాధాలు
హింసాపాచికలు యమపాశాలై ప్రాణాలను తోడేస్తే
నూరేళ్లు కలిసుందామని
కళ్లల్లో ముద్రించుకున్న భర్తల ప్రతిరూపాలు
వారికన్నీటి కడలిలో నిమజ్జనం చేసి
గుమ్మడికాయలా పగిలిపోయే తమ గుండెకాయకు
ఏడుపు ముడులేసుకొని ఎవరూరుకుంటారు?
ఏ దిక్కూతోచక ఎలా మిగిలిపోతారు?

(కశ్మీర్ ఉగ్రవాదుల చేతుల్లో భర్తను కోల్పోయిన నవవధువు బాధను చూసి రాసిన కవిత)



సందీప్ వొటారికారి
93902 80093

‘అన్యాయాన్ని ఎదిరించేటోడు నాకు ఆరాధ్యుడు’ అన్నారు ప్రజాకవి కాళోజీ నారాయణరావు. ముఖ్యంగా పాలకవర్గాలు ప్రజలపై అణచివేత ధోరణి అనుసరిస్తున్నప్పుడు, నయవంచనకు పాల్పడినప్పుడు ప్రశ్నించే గొంతుల నుంచి వెలువడే అక్షరాలే ప్రజల పోరాటానికి అస్త్రాలుగా నిలుస్తాయి. కానీ, సమకాలీన సమాజంలో ప్రభుత్వాలు, పాలనాతీరుపై రాస్తున్న సాహిత్యం అరుదుగానే కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో కవి, రచయిత విశ్వనాథుల పుష్పగిరి రాసిన ‘రేవనాలు’ కవితా సంపుటి ప్రత్యేకతను సంతరించుకున్నది. తెలంగాణలో కాంగ్రెస్ 16 నెలల పాలనలోని 16 అంశాలపై పుష్పగిరి కవితలు రాశారు. గతించిన చరిత్రలోని పాలకులపై పుంఖానుపుంఖాలుగా పుస్తకాలు రాసే కవులు, రచయితలు ఉన్నారు. కానీ, సిట్టింగ్ సీఎం రేవంత్‌రెడ్డిది రోకుతప్పిన పాలన అంటూ ధిక్కార స్వరం వినిపించిన కవి పుష్పగిరి.

# రోకు తప్పిన పాలనపై ‘రేవనాలు!’



విశ్వనాథుల పుష్పగిరి స్వస్థలం నల్లగొండ జిల్లా, నార్కట్‌పల్లి మండలం, బ్రాహ్మణవెల్లంల గ్రామం. విశ్వనాథుల పిచ్చయ్య, జంగమ్మకు పుష్పగిరి మూడో సంతానం. పుష్పగిరి తండ్రి పిచ్చయ్య కమ్మరి కొలిమి వద్ద పని చేసుకుంటూనే పద్యాలు, పాటలు ఆలపించేవారు. ఈ నేపథ్యంలో విశ్వనాథుల పుష్పగిరికి సాహిత్యం పట్ల ఆసక్తి కలిగింది. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో 2012 సమయంలో ‘నరమాంస భక్షణ’ పేరుతో ఓ పుస్తకాన్ని ప్రచురించారు. అవినీతి, దోపిడీ, క్రూరత్వం తదితర అంశాలను ప్రస్తావిస్తూ మనిషి నైజాన్ని ఎండగట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ‘కైవారం’ అనే పుస్తకం ప్రచురించారు. ఇందులో తెలంగాణ గ్రామీణ వృత్తి జీవితాలను ఆవిష్కరించారు. కాంగ్రెస్ ఇచ్చిన అలవికాని హామీలు చూసి... అద్భుతమేదో జరుగుతుందని ఆశపడ్డ జనం ఆ పార్టీకి అధికారం కట్టబెట్టారు. అద్భుతం జరగడం సంగతి పక్కనపెడితే అంధకారం అలుముకుంది. ప్రజల జీవితాలు దుర్భరంగా మారిపోయాయి.

> ఎవరిని కదిలించినా ఆవేదనతో తమ గోసను వెళ్లగక్కుతున్నారు. చిరువ్యాపారులు, ఆటోవాలాలు, కార్మికులతో మమేకమైనప్పుడు తనలో కలిగిన స్పందనను పుష్పగిరి కవితలుగా రాశారు. ప్రజల తరఫున గొంతుకను వినిపించేందుకు, జనం ఆవేదనకు అక్షరరూపం ఇచ్చేందుకు నడుంకట్టారు. ప్రజాగ్రహానికి కవిత్వ రూపమిచ్చారు.

వ్యంగ్య విమర్శలు అనే మాటకు తెలంగాణ గ్రామీణ మాట ‘రేవనాలు’. స్వచ్ఛమైన పచ్చిపాల వంటి మట్టిమనుషుల మాటను తన పుస్తకానికి పేరుగా పెట్టుకోవడంలోనే కవి అభిరుచిని అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్ 16 నెలల పాలనలో ప్రజలు అనుభవిస్తున్న కష్టాలను 16 కవితలుగా ఆవిష్కరించారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ తొలి పర్యటన నుంచి తెలంగాణ తల్లి విగ్రహం మార్పు, లగచర్ల లడాయి, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పర్యావరణ విధ్వంసం వరకు... ఇలా ప్రతీ అంశాన్ని తన కవితలకు ఇతివృత్తాలుగా మలుచుకున్నారు. ప్రముఖ కవి, విమర్శకుడు అంబటి సురేంద్రరాజు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవి, రైతు నారాయణదాసు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలువురు కవులు, రచయితలు రేవనాలు పుస్తకం సరైన సమయంలో ప్రజలకు ఓ అక్షరాయుధాన్ని అందించిందని కొనియాడారు. తెలంగాణలో ప్రజల తరపున కవులు గొంతెత్తాల్సిన ఆవశ్యకతను అంబటి సురేంద్రరాజు ఈ సందర్భంగా వివరించారు. ‘కవులు ఆగమై పదవులు, అవార్డుల కోసం ప్రభుత్వ పాదాల వద్ద చేరారు. కవులు అని చెప్పుకొనే కుకవుల, నామమాత్ర కవుల నుంచి తెలంగాణ సమాజం జాగ్రత్తగా ఉండాలి. విశ్వనాథుల పుష్పగిరి లాంటి కవులు స్వతంత్రంగా, ఏ సంఘాలతో సంబంధం లేకుండా ప్రజల పక్షాన నిలబడడం గొప్ప విషయం. నిద్రపోతున్న సమాజాన్ని మేల్కొల్పాల్సిన బాధ్యత కవుల మీద ఉంది. పుష్పగిరి సాహిత్యం వంటి కవనధారను కాపాడుకోవాలి. ఈ పుస్తకాన్ని 33 జిల్లాల్లో ఆవిష్కరించాలి’ అని చెప్పారంటేనే తెలంగాణ సమాజంలో ‘రేవనాలు’ ఎంతటి ప్రభావవంతమైనదో అర్థం చేసుకోవచ్చు.

అసెంబ్లీ ఇప్పుడు అర్రాజు పాడుతున్న మేకల మండి, ఢిల్లీకి కప్పంగడుతున్న గోదురు కప్ప... చరిత్రలో ఏకైక ప్రీపెయిడ్ ముఖ్యమంత్రి, నాలుగున్నరకోట్ల మంది నిన్ను సాపిస్తున్నప్పుడు... నువ్వు ఎవరిదో సావు కోరుకుంటున్నవంటే.. నీ నడిమంత్రపు సిరి ఎంత గావరవెడ్తుందో, నిజమే.. నీ పెట్టుబడులన్నీ దిల్‌సుఖ్‌నగర్ విమానాశ్రయాలే, దేవాన దేవుండ్ల మీద నువ్వు పెట్టిన వొట్లన్నీ.. కాన్సిలైన ఓట్లల్ల చేరిపోయినయి, గూట్లె దీపంపెట్టి.. గుళ్లె లింగాన్ని మింగకు, కోటి రతనాల వీణ కాదిది.. కొంగలు దొక్కిన పొలం... ఇలా ఒక్కో కవితను ఎంతో భావోద్వేగంతో రాశారు. తెలంగాణ రక్తంలో ఉన్న తిరుగుబాటు మనస్తత్వం, ధిక్కార నైజం పుష్పగిరిలో కనిపిస్తున్నది. ప్రజలకు పోరాటతత్వాన్ని కూడా బోధించిన పద్ధతి ఆకట్టుకుంటుంది. అతడి కవితలలో కాళోజీ, శ్రీశ్రీ, అలిశెట్టి శైలి గోచరిస్తున్నది. రాజీపడని మనస్తత్వంతో ప్రజల తరపున పుష్పగిరి మరిన్ని కవితాపుష్పాలు విరబూయించాలని ఆశిద్దాం.



ఇనుగుర్తి సత్యనారాయణ
97046 17343




## మానవత్వం మంటగలిసింది

బాంబులెన్ని పేలినా..
భవనాలెన్ని కూలినా..
శరీరాలెన్ని చీలినా..
అసువులెన్ని రాలినా..
నేర్చుకోలేదింకా మనం ఏ పాఠం..!
సంయమనం పాటిస్తాం..
శాంతిమంత్రం జపిస్తాం..
దవాఖానల్లో చేర్పిస్తాం..
ఓ కన్నీటి బొట్టు రాల్చేస్తాం..
మరునాడు మరణాల సంఖ్య చాటేస్తాం..
ఆ తరువాత విషయాన్ని దాటేస్తాం..
బాంబనేది పిచ్చివాడి చేతిలో ఓ రాయి..
ఎవడు విసిరినా, వాడు మనకు పరాయి..
ఓ స్వప్న, ఓ వినోద్..
ఓ రఫీక్, ఓ ఎజాజ్..
మనిషెవరైనా.., మతమేదైనా...!
మారణహోమం మసి చేసింది..!
మానవత్వం మంటగలిసింది..!



వీపూరి శ్రీనివాస్
98498 93426



## గాయం

రాత్రి గాయం తెల్లారకముందే మానాలి
రాత్రి వేళ మందులు దొరకవు
కిటికీ ఆవల కురిసే వెన్నెలే లేపనమవ్వాలి

కిటికీ లోపల నాలుగు గోడల మధ్య చీకటిలో ఆమె

మానినా మానకపోయినా
మోములో నవ్వులు రువ్వాలి
వాకిట్లో సంధ్య రాకముందే ముగ్గు పడాలి
ఆమె నిత్య జీవన చిత్రం!



గిరి ప్రసాద్ చెలమల్లు
94933 88201